అద్దెకొంపల్లో ఉన్నవారూ, సొంతకొంపల్లో వారూ, పేవుమెంట్లమీద బ్రతికినవారూ, చెట్ల క్రింద సంసారాలుచేసే దీనులూ హీనులూ అంతా ఊళ్ళోంచి కాట్లోకిపోవలసినవారే; ఈ మాత్రానికి – జాతుల్ని, మతాన్ని, దేవుడ్ని, ఆచారాల్నీ అడ్డుపెట్టుకుని అన్నలారా అమ్మలారా; అక్కలారా; దొంగనాటకా లాడకండి – పీకలు కత్తిరించకండి; బూడిదలో పన్నీరు పోయకండి; మీరంతా సంతోషంగా వుండాలి నిజవేఁ, అందుకు కొంపల్లో చిచ్చు పెట్టకండి.

– నాయన్లారా కాస్త జాలి చూపించండి తోటివారిమీద, తండ్రులారా దయ వుంచండి. తోటి మనుష్యుల్ని నమిలి మ్రింగకండి –

అవును అది చంద్రనిప్పులు చెరగవలసిన మండువేసవి. కాని ఆరోజెందుకోగాని మీ నాన్నగారి శవంమీద దివినుండి భువికి దేవతలు వర్షం కురిపించారు.

# మా మావగారి శోషలిజం

**మా** అత్తగారు ఊళ్లోలేనపుడు ఇంట్లో సోషలిజాన్ని ప్రవేశపెట్టారు.

మామావగారు. మరి పెద్దదిక్కు లేనపుడు ఇంట్లో అంతా శోషలిజమే కదా; నిండుసభలో దుశ్శాసనుడు ద్రౌపది వలువలను దుల్చినట్లు బడియల్సులోనుంచి బడియాలు లాగుతూంటారు మా వాళ్ళు. దొడ్లో మొక్కలు నాటినట్లు విప్లవబీజాలు నాటుతుంటారు మా ఇంట్లో –

అంచేత మా ఇల్లు ఒక డెవిల్సు వర్క్ షాప్ (అనగా రాక్షసుల కొంప) అంచేత అక్టోబరు విప్లవం మా ఇంట్లో జనవర్లో వచ్చేసింది.

మానాన్న వట్టి కంఠశోషలిస్టే కాని మా మామయ్యగారు గొప్ప ఐడియా పురుషులు. మా ఇల్లు ఎప్పుడూ స్వర్గసీమ కాదని, మా ఇంట్లో ఎప్పుడూ పావురాలు ఎగురలేదని – "ఇట నిట లేక్షణుండు గజ్జెకదలించి యాడు రంగ స్థలంబు" అని చెప్పాలని కాదు నా ఉద్దేశం.

క్షణంలో సగం వరకూ,

అంతా దేవతలే –

ఎటుచూసినా వెన్నెలే. ఎవరి మొహంలో నైనా చిరునవ్వులే –

మా ఇల్లు నందనవనమే,

మా కది బృందావనమే;

మా అత్తయ్య ఊళ్లో లేని నెల్లాళ్ళలో మా మామగారి సోషలిజానికి మా ఇల్లు నిరుపయోగ ప్రయోగశాల అయిపోయింది.

"కామన్ కిచెన్" – "యూనిఫామ్"

"ఇండస్ట్రీస్ – పరిశ్రమలు నెలకొల్పడం,"

"పిల్లలకు స్పోర్ట్స్ ", "గురుకులం స్థాపన"

"లేడీస్ క్లబ్" ఈ కార్యక్రమాలన్నీ చక చక శరవేగంతో జరిగి పోయాయి.

ఆ స్టోరీ చెప్పెద నవధరింపుడు, సూతుడు శౌనకాది మహామునులకు చెప్పినట్లు దేవా! వైశంపాయనుడు జనమేజయుని కిట్లనియె-ఎట్లనియే?

"కామన్కిచెన్"

కామన్కిచెన్కామన్కిచెన్ అంటూ మా చుట్టాలిళ్ళలో పొయ్యి లెత్తించేశారు. ఆడవాళ్ళు వంటింట్లో పొయ్యిముందు మగ్గిపోకూడదు. ఇన్ని రకాల రుచులూ, అభిరుచులూ, పనికిరావు. ఏదిచేస్తే అది తినాలి. ఉన్నదే అందరూ సమానంగా పంచుకు తినాలి అంటూ మాకు కావల్సినవాళ్లు, మాకు తెల్సినవాళ్లు అందర్నీ ప్రోగుచేసి మాఇంట్లో కామన్కిచెన్ తెరిచేశారు. కొందరు ఎక్కువ తింటారు. కొందరు తక్కువ తింటారు. తిండిలో సమానం అంటే ఎలాగ? చిన్న సంసారాలుంటాయి. పెద్ద సంసారాలుంటాయి. ఈ కామన్కిచెన్ పనిచేసిన నెల్లాళ్లూ మా ఇల్లు డెవిల్స్ వర్క్ షాపయికూర్చుంది. అప్పుడే ఎదటబడి ఈసోషలిజం మానందనిచెప్తే ఆయన వింటారా? గుడ్లురిమి చూసేవారు. కొందరాడవాళ్ళు పప్పుదిమ్మక్కలా తిని కూర్చునేవారు. మా వంతేమో చాకిరీ - నడుం పడిపోయిందంటే నమ్మండి. మంచినీళ్ళుపోసి గ్లాసులు పెట్టి విస్తళ్ళేసి విస్తళ్ళెత్తడానికి మగపిల్లల్ను వాలంటీర్లుగా వేసి కొంచెం ఉప్మా ఎక్కువ పెట్టమనేవారు. ఉప్మా తినడానికైతే ముందుండేవారు కాని విస్తళ్లెత్తడానికి వచ్చేవారు కాదు.

ఆయన సోషలిజానికి ఆడవాళ్లు, పిల్లలేకాదు మగవాళ్ళు కూడా హడలి పుంజాలు తెంచుకుని పారిపోయేస్థితి వచ్చిందంటే నమ్మండి. గ్లాసులు, కంచాలు అంటగిన్నెలు ఆడవాళ్ళు ఎందుకు తోమాలి? అందరూ తోమాలని ఒక రూలు పెట్టారు. ఆయన పోరు పడలేక ఒకటి రెండుసార్లు తోమినా "అంట్లు" అనే మాట వినబడే సరికి మగాళ్ళకు పైప్రాణాలు పైకి లేచిపోయేవి.

ఏలూర్లో మేమంతా ఒక పెద్ద మండువాలోగిలిలో అద్దె కుంటూండేవాళ్ళం. ఆ విధంగా కామన్కిచెన్ రన్చేసి మా ఇంటిని నిజంగా ఒక డెవిల్స్ వర్క్షాప్లా చేసిపెట్టేశారు. పొయ్యిలు ఎత్తివేసిన వాళ్ళేమో బాగుపడ్డారు.

గాడిపొయ్యిలు తప్పుకుని మేమేమో పూర్తిగా దెబ్బతినేశాం. కాని ఆయన ఎంతో చిత్తశుద్ధితో ఆమాటలు చెబుతూంటె మాకు స్వర్లోకకవాటాలు తెర్చుకున్నట్లుండేవి. కామన్కిచెన్ రన్ చేసిన నెల్లాళ్ళకి ఎక్కడచూసినా బాకీలే; ఏకొట్లో చూసినా మన కాతాలే... అప్పులాళ్ళకేమో మా ఇంట్లో సోషలిజం సంగతి తెలీక సానుభూతి లేకుండా వచ్చి గోల చేసి పోతుండేవారు. ఆయన ఇంట్లోవుంటే మెత్తమెత్తగా నంగిరి పింగరిగా మాట్లాడిపోయేవారు. ఆయన వాళ్ళను భస్మంచేసే దృక్కులతో కాక చల్లగా, తియ్యగాను మధురంగా మాట్లాడి లాలించి పంపేసేవారు.

"యూనిఫామ్స్"

మా మావగారికి డిసిప్లిన్ అంటే ఎంత ఇష్టమో యూనిఫారాలంటే మరీ ఇష్టం; డిసిప్లిన్ లేకుండా శోషలిజం లేదనేవారు.

పెద్దా చిన్నా అందరికీ మలేసియా గుడ్డ తాన్లకు తాన్లు తెప్పించి రెండు మూడు జతలు నిక్కర్లు, షర్టులు వాటికి మేకచెవులు, జేబులమీద మూతలూ, గుండీలు అన్నీ కుట్టించి నానాహంగామా చేసేవారు. ఈ యూనిఫారాలేసుకుని అంతా డిసిప్లిన్డ్ సోల్జర్‌వలె వుండాలనేవారు. పొద్దున్నే డ్రిల్లుకి వెళ్లాలనేవారు. ఇంటికి దగ్గర్లో గ్రవుండులో పొద్దుటి పూట డ్రిల్లు పెట్టేసరికి, ఆడి ఆడి వచ్చేవారేమో మెస్సులో ఎగబడి గిన్నెలు కూడా నాకేసేవారు ఆకలికి తట్టుకోలేక - చెయ్యలేక మేం చచ్చేవాళ్ళం అనుకోండి; కర్రలు జోళ్ళు, విజిల్సు యింటినిండా డిసిప్లిన్‌కి పనికి వచ్చే సామాను ఎక్కువయిపోయింది. అప్పుడు మా మామయ్యగారు మధ్యందిన మార్తాండునివలె తేరి పారచూడ శక్యంకాకుండా వుండేవారు.

డ్రిల్లు ఆడవాళ్ళకు లేకపోయినా యూనిఫాం వేసుకోవాలని ఆడవాళ్ళకు బ్లూ కలరు ఫిక్స్ చేశారు. కొంతమంది కొన్నారు కొంత మంది కొనలేదు. కొన్నా అంతమందీ యూనిఫారాలు ఎప్పుడూ వేసుకోలేదు. డిసిప్లిన్ విషయంలో ఆడవాళ్ళు ఎప్పుడూ వీకేగా - రాస్కెల్స్, ఉద్ధరిద్దామన్నా పైకిరారు అని విసుక్కున్నారేమో లోపల - చాకిరీ జీవులని ఆడవాళ్లపట్ల పరమజాలి. ఎంత మంచినగలు, దుస్తులేసుకున్నా ఆడవాళ్ళు తమ అజ్ఞానాన్ని కప్పిపుచ్చుకోలేరట? నయం - అందుకే ఆడవాళ్ళు భక్తిని ముసుగేసుకుని దేవుళ్ళని తెచ్చి కప్పుకున్నారన్నారు కాదు.

ఇండస్ట్రీస్

బిజినెస్ చేయాలి బిజినెస్ చేయాలి అంటూండేవారు మా మావగారు. మా ఇంట్లో శోషలిజం వచ్చాక ఇండస్ట్రీస్ పెట్టాలి ఇండస్ట్రీస్ పెట్టాలి అనే నినాదం ప్రారంభించారు అన్నారంటే అదిథీరీగా గాలికివదిలేసి వూరుకునేరకం కాదు. మూడు నాలుగువేలు అప్పుచేసి తివాసీలు నేసే మగ్గాలు తెప్పించి రత్న కంబళ్ళు నేయించారు. మాకు బ్లూ చీరలూ మగవాళ్ళకు మలేసియా దుస్తులూ ఇంటినిండా రత్నకంబళ్లు - కామన్‌కిచెన్ యూనిఫారాలు, గురుకుల చిల్డ్రన్స్ స్పోర్ట్స్, లేడీస్ క్లబ్ వ్యవహారాల వల్ల వచ్చిన నష్టం, అప్పులు తీర్చడానికి ఈ రత్నకంబళాలన్నీ మళ్ళీ కాళ్ళు వచ్చి నడచిపోయాయి, ఇంట్లోంచి, మా అత్తయ్య నెల్లాళ్ళు యింట్లో లేనప్పుడు - మా ఇంట్లో అక్టోబర్ విప్లవం జనవరిలో వచ్చినప్పుడు మేమంతా శోషలిజంలో పడికొట్టుకుపోయాం. మా అత్తయ్య పెద్దదిక్కు వచ్చేదాకా మాకా ఇంట్లో శోషలిజమే.

ఈ రోజు మా యింట్లో ఒక్కరత్న కంబళం లేకపోయినా ఒకప్పుడు మా యింట్లో శోషలిజం వర్ధిల్లినరోజుల్లో మా ఇల్లు ఒక డెవిల్స్ వర్క్‌షాప్ అయితే కావచ్చుగాక, మేం పట్టు తివాసీలమీద నడిచాం. నడిచిన రోజులున్నాయంటే నమ్మండి. నమ్మరూ; ఐ డోంట్ కేర్;